## క్లుప్తంగా

### డ్రాయింగ్, వక్తృత్వ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ


పోటీల్లో ప్రతిభ కనబరిచిన పతివాడ మేఘన

నెల్లిమర్ల రూరల్: విశాఖ పట్నంలోని ఇందిరా గాంధీ జూ లాజికల్ పార్క్‌లో బుధవారం నిర్వహించిన వైల్డ్ లైఫ్ వీక్ పోటీల్లో మండలం లోని కొండగుంపాం విద్యార్థినులు ప్రతిభ కనబరిచారు. పాఠ శాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న పతివాడ మేఘన, షర్మిల వక్తృత్వ, డ్రాయింగ్ పోటీల్లో ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు. ఈ మేరకు విద్యార్థులను హెచ్ఎం వేణుగోపాలరావు, జీవశాస్త్ర ఉపాధ్యాయుడు సత్యప్రకాశ్, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

### సీజేఐపై దాడికి యత్నించడం సరికాదు



నిరసన కార్యక్రమంలో పాల్గొన్న న్యాయవాదులు

విజయనగరం లీగల్: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి గవాయ్‌పై దాడికి యత్నించడం హేయమైన చర్యగా స్థానిక న్యాయవాదుల సంఘ అధ్యక్షుడు కలిశెట్టి రవిబాబు అభివర్ణించారు. చీఫ్ జస్టిస్ గవాయ్‌పై జరిగిన సంఘటనకు నిరసనగా న్యాయవాదులు బుధవారం తమ విధులను బహిష్కరించారు. అనంతరం రవిబాబు మాట్లాడుతూ.. ఈ చర్యకు పాల్పడిన న్యాయవాదిని కఠినంగా శిక్షించాలన్నారు. ఈ చర్య న్యాయవ్యవస్థపై దాడిగా భావించాలన్నారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా తగిన విధంగా చర్యలు చేపట్టాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు సలితం సురేష్ కుమార్, కళ్లెంపూడి వెంకటరావు, సుశీల, భారతి, తదితరులు పాల్గొన్నారు.

### పరిశీలన


నెలివాడలో బాణసంచా గొడౌన్‌ను పరిశీలిస్తున్న పోలీసులు

బొండపల్లి: మండలంలోని నెలివాడ, రోళ్లవాక గ్రామాల్లో గల దీపావళి మందుగుండు సామగ్రి గొడౌన్‌లను గజపతినగరం సీఐ జీఏవీ రమణతో పాటు ఎస్సై యు.మహేష్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా గొడౌన్‌ల నిర్వహణకు సంబంధించి అన్ని అనుమతులు ఉన్నదీ, లేనిదీ ఆరా తీశారు. అనుమతుల్లేకుండా మందుగుండు సామాగ్రి విక్రయించినా, నిల్వ చేసినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

### సామూహిక సీమంతం


గర్భిణులకు సీమంతం నిర్వహిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ హైమా, తదితరులు

లక్కవరపుకోట: మండలంలోని కొత్తగంగుబూడి అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ మల్లివీడు సెక్టార్ సూపర్‌వైజర్ కె. హైమ ఆధ్వర్యంలో గర్భిణులకు బుధవారం సామూహిక సీమంతం నిర్వహించారు. ఈ సందర్భంగా పౌష్టికాహారం, తల్లిపాల ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. ప్రభుత్వం అందజేస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

### సంతకాల సేకరణ


ఎస్.కోటలో సంతకాలు సేకరిస్తున్న కాంగ్రెస్ నేతలు

శృంగవరపుకోట: నియోజకవర్గ కేంద్రమైన ఎస్.కోటలో కాంగ్రెస్ నాయకులు ఓట్ చోర్.. గద్దె చోడ్ కార్యక్రమంలో భాగంగా బుధవారం సంతకాల సేకరణ చేపట్టారు. దీవీ జంక్షన్, పట్టణ ప్రధాన రహదారి, వీధుల్లో ర్యాలీ చేపట్టి సంతకాలు సేకరించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గేదెల తిరుపతి మాట్లాడుతూ.. ఈవీఎంలను టాంపరింగ్ చేసి బీజేపీ గెలిచిందని ఆరోపించార. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చింతల ఈశ్వరరావు, మోహన్, పదాల మణిబాబు, హెచ్.నానాజీ, కృష్ణ, అప్పడు, సురేష్, లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.

# అప్రమత్తత తప్పనిసరి..

- వరి పంటకు ఆశిస్తున్న ఎండు ఆకు తెగులు
- శాస్త్రీయ పద్ధతుల్లో ఎరువులు పిచికారీ చేయాలి
- ఏఓ నీలిమ


పూసపాటిరేగలో ఎండు ఆకు తెగులు కారణంగా దెబ్బతిన్న వరిసాగు

పూసపాటిరేగ: ప్రస్తుతం వరి పంటకు ఎండు ఆకు తెగులు ఆశిస్తోందని.. ఈ తెగులు పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. ఇప్పటికే చాలా చోట్ల వరి పంటకు ఎండు ఆకు తెగులు ఆశించిందని ఏఓ నీలిమ తెలిపారు. ఏమాత్రం నిర్లక్ష్యంగా ఉన్నా నష్టాలు తప్పవని హెచ్చరిస్తున్నారు. ఖరీఫ్ సీజన్‌లో సాగు చేస్తున్న వరి పంటకు సంబంధించి ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు. నెల్లిమర్ల నియోజకవర్గం వ్యాప్తంగా సుమారు 21 వేల ఎకరాలలో వరి సాగు జరుగుతోంది. ఈ పరిస్థితుల్లో తెగుళ్లకు సంబంధించి ఏఓ నీలిమ పలు సూచనలు, సలహాలు అందించారు.

**కాండం తొలుచు పురుగు:** నారు నుంచి పూత దశ వరకు కాండం తొలుచు పురుగు ఆశించే అవకాశం ఉంది. ఈ తెగులు సోకితే పిలక దశలో మొవ్వ చనిపోవడం, పూత దశలో తెల్లకంకులు ఏర్పడడం జరుగుతుంది.

**పాముపొడ తెగులు:** ఈ తెగులు ఆశిస్తే దిగుబడి బాగా తగ్గిపోతుంది. దీని నివారణకు లీటర్ నీటిలో 2ఎం.ఎల్ హెక్సాకొనజోల్ కలిపి పిచికారీ చేసుకోవాలి. ఎకరాకు 400 ఎం.ఎల్ మందును శాస్త్రీయ పద్ధతుల్లో పిచికారీ చేసుకోవాలి. లేదా ప్రొపికొనజాల్ 200 ఎంఎల్ సరిపడీ నీటిలో కలుపుకుని పిచికారీ చేసుకోవాలి.

**ఆకుముడత తెగులు:** ఈ తెగులు నివారణకు లీటర్ నీటిలో 2.5 ఎం.ఎల్ క్లోరిపైరిపాస్ కలిపి పిచికారీ చేసుకోవాలి. పైరు చిరు పొట్టదశలో ఉంటే ఎకరాకు ఎనిమిది కిలోల హైడ్రోక్లోరైడ్ గుళికలు పిచికారీ చేసుకోవాలి.

**ఎండాకు తెగులు :** పొటాష్ లోపం వల్ల ఈ తెగులు ఆశిస్తుంది దీని నివారణకు ఎంఓపీ ఎరువు వేయాలి. మూడో దశలో 25 కిలోల ఎంఓపీ, 25 కిలోల యూరియా వేయాలి.

### యాజమాన్య పద్ధతులు పాటించాలి..



వరి పంటలో అధిక దిగుబడులు సాధించాలంటే సస్యరక్షణ చేపట్టాలి. నీటి యాజమాన్య పద్ధతులు, ఎరువులు యాజమాన్య పద్ధతులు పాటించాలి. చిన్న చిన్న మెలకవులు పాటిస్తే పెట్టుబడులు తగ్గడంతో పాటు దిగుబడులు బాగుంటాయి. రైతులకు కావాల్సిన సూచనలు, సలహాలు క్షేత్రస్థాయిలోకి వెళ్లి అందిస్తున్నాం.

కె. నీలిమ, మండల వ్యవసాయాధికారి పూసపాటిరేగ

# ఆర్టీసీ కాంప్లెక్స్ కిటకిట


ప్రయాణికులతో కిటకిటలాడుతున్న ఆర్టీసీ కాంప్లెక్స్

- తిరుగు ప్రయాణాలతో బస్సులు రద్దీ
- నేడూ ప్రత్యేక సర్వీసులు కొనసాగింపు : ఆర్టీసీ అధికారులు

విజయనగరం అర్బన్: దసరా, పైడితల్లి పండుగ పూర్తవడంతో తిరుగు ప్రయాణికుల సందడి బుధవారం నుంచి ప్రారంభమైంది. దూర ప్రాంతాల నుంచి గ్రామాలకు వచ్చిన జిల్లా వాసులు మూడు రోజుల పండుగను ముగించుకుని తిరుగుప్రయాణం సాగిస్తున్నారు. మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడంతో ఈ ఏడాది ఎక్కువ మంది భక్తులు ఆర్టీసీ బస్సుల వైపు మొగ్గుచూపడం కనిపించింది. మరోవైపు రైల్వే రిజర్వేషన్‌లు దొరకని వారు కూడా ఆర్టీసీ బస్సులను ఆశ్రయిస్తున్నారు. విశాఖ మీదుగా విజయవాడ, హైదరాబాద్‌కి వెళ్లే సర్వీసులకు డిమాండ్ నెలకొంది. ఆన్‌లైన్‌లో కూడా టికెట్లు తీసుకునే సౌలభ్యం కల్పించామని, ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని ఆర్టీసీ అధికారులు కోరుతున్నారు. పార్వతీపురం, సాలూరు, బొబ్బిలి నుంచి జిల్లా కేంద్రం మీదుగా విశాఖ, ఆపై వెళ్లే దూరప్రాంతాలకు సర్వీస్‌లు నడుపుతున్నారు. జిల్లా కేంద్రం నుంచి విశాఖకు ప్రతి ఐదు నిమిషాలకు ఒకటి వంతున సర్వీసు ఉంది. దీంతో జిల్లా కేంద్రం నుంచి వెళ్లే ప్రతి బస్సు ప్రయాణికులతో కిటకిటాడింది. ప్రయాణికుల రద్దీ నేపథ్యంలో జిల్లా కేంద్రం నుంచి విశాఖ, సింహాచలం, అనకాపల్లి, శ్రీకాకుళం, చీపురుపల్లి, పాలకొండ, సాలూరు, పార్వతీపురం, ఎస్.కోట ప్రాంతాలకు ప్రత్యేక సర్వీసులు గురువారం కూడా కొనసాగిస్తామని అధికారులు తెలిపారు.

# పండుగ ముగిసినా అదే సందడి..


ప్రత్యేక అలంకరణలో పైడితల్లి


అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

విజయనగరం పైడితల్లి జాతర అంగరంగ వైభంగా ముగిసింది. మూడు రోజుల జాతరలో లక్షలాది మంది భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఎక్కడెక్కడో స్థిరపడిన వారు సైతం సొంత గ్రామాలకు వచ్చి తమ ఇలవేల్పు అయిన పైడితల్లికి మొక్కులు చెల్లించుకున్నారు. బుధవారం కూడా పైడితల్లి ఆలయానికి భక్తులు పోటెత్తారు. అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని, ప్రశాంత వదనంతో వెనుదిరిగారు. ఆలయ సమీపంలో ఉంచిన సిరిమానుకు పూజలు చేపట్టారు. కొంతమంది భక్తులు సిరిమాను చెక్కలు కొనుగోలు చేశారు. జాతర నేపథ్యంలో ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన దుకాణదారులకు బుధవారం కూడా మంచి వ్యాపారం జరిగింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయనగరం


ఆలయప్రాంతంలో జనసందోహం


సిరిమానుకు మొక్కుతున్న మహిళా భక్తురాలు




ఆలయ ప్రాంతంలో సిరిమాను చెక్కలను విక్రయిస్తున్న సంబంధిత సిబ్బంది








చిరు వ్యాపారులు,కొనుగోలుదారుల సందడి

# దారులు ఛిద్రం.. ప్రయాణం నరకం..!

- గోతులమయమైన గ్రామీణ ప్రాంత రహదారులు
- రాకపోకలకు ఇబ్బందులుపడుతున్న ప్రజలు
- జంగిల్ క్లియరెన్స్ కూడా చేపట్టని వైనం


తెర్లాం: కాగాం-పాములవలస రోడ్డులో ఏర్పడిన గోతుల్లో నిలిచిన నీరు


తెర్లాం: ఎం.ఆర్.అగ్రహారం- ఉత్తరావల్లి మధ్య శిథిలమైన రోడ్డు

బొబ్బిలి, రాజాం నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంత రహదారులు అధ్వానంగా తయారయ్యాయి. గ్రామాలను అనుసంధానం చేసే రోడ్లతో పాటు మండల కేంద్రాలను అనుసంధానం చేసే రోడ్లు కూడా ఛిద్రమయ్యాయి. పెద్దపెద్ద గోతులతో, రాళ్లు తేలి దర్శనమిస్తున్నాయి. ఈ రోడ్లపై రాకపోకలు సాగించేందుకు ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారు.వర్షాలు కురుస్తుండడం తో రోడ్లు చిత్తడిగా మారుతున్నాయి. గోతుల్లో నీరు చేరి చెరువులను తలపిస్తున్నాయి. ప్రధానంగా మలుపుల వద్ద ఉన్న గోతుల వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. గోతులకు తోడు రోడ్లకు ఇరువైపులా జంగిల్ క్లియరెన్స్ కూడా చేయక పోవడం ప్రమాదాలకు కారణ మవుతోంది. పాలకులు, అధికారులు స్పందించి రోడ్ల మరమ్మతులు చేపట్టాలని ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు.

– తెర్లాం/సంతకవిటి


తెర్లాం: బురదమయమైన ఉద్దవోలు-యు.గదబవలస రోడ్డు


తెర్లాం: తమ్మయ్యవలస రోడ్డులో ఇరువైపులా దట్టంగా పెరిగిన తుప్పలు


తెర్లాం: చెరువులా దర్శనమిస్తున్న కుసుమూరు-అంపావల్లి రోడ్డు


తెర్లాం: అధ్వానంగా అంట్లవార గ్రామ రోడ్డు


సంతకవిటి: సంతకవిటి- రాజాం ప్రధాన రహదారిలో తాలాడ వద్ద మలుపులో ఏర్పడిన గొయ్యి

# ఆదాయ వనరులు గుర్తించాలి


శిక్షణలో మాట్లాడుతున్న డిప్యూటీ ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్

చీపురుపల్లి: పంచాయతీల అభివృద్ధికి ప్రభుత్వం నుంచి వచ్చే నిధులతో పాటు స్వంత ఆదాయ వనరులను గుర్తించి వాటిని సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ ఎంపీడీఓ టి.ప్రవీణ్‌కుమార్ చెప్పారు. ఆర్‌జీఎస్ఏ కార్యచరణ ప్రణాళిక, ఓన్ రిసోర్స్ రెవెన్యూ(ఓఎస్ఆర్) అంశాలపై రెండు రోజులు శిక్షణా కార్యక్రమంలో భాగంగా బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన శిక్షణలో ఆయన మాట్లాడారు. పంచాయతీల్లో ఆదాయ వనరులు పెరిగినప్పుడే అభివృద్ధి సాధ్యపడుతుందన్నారు. అందుకోసం స్వంత ఆదాయ వనరులు గుర్తించి వాటిపై పన్ను, పన్నేతర ఆదాయ వనరులుగా మార్చుకునేందుకు ప్రణాళికలు రచించాలన్నారు. గ్రామాల అభివృద్ధికి స్వంత ఆదాయ వనరులు వినియోగంలో భాగంగా వినూత్న ప్రాజెక్టులు ఏర్పాటుకు నిధులు సమకూర్చుకోవాలన్నారు. పంచాయతీల అభివృద్ధి ప్రణాళికలు రూపకల్పనలో నైపుణ్యాలను శిక్షణలు తెలియజేస్తారని అవగాహన కల్పించుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, డిజిటల్ అసిస్టెంట్లు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

### సీజేఐపై దాడి క్షమించరానిది

చీపురుపల్లి: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బిఆర్.గవాయ్‌పై దాడి క్షమించరాని నేరమని నియోజవకర్గ దళిత బహుజన సంఘాలు ప్రతినిధులు అన్నారు. సీజేఐపై సుప్రీంకోర్టులోనే దాడి చేయడాన్ని నిరసిస్తూ బుధవారం పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం సీజేఐపై దాడి చేసిన వారిని శిక్షించాలి అంటూ పలు నినాదాలు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ సీజేఐ గవాయ్‌పై జరిగిన దాడి దేశంలో ఉన్న న్యాయవ్యవస్థపై జరిగిన దాడిగా పరిగణించాలన్నారు. అంతేకాకుండా ఉన్నత స్థానాల్లో ఉన్న అణగారిన వర్గాలపై జరిగిన కుట్ర అన్నారు. దాడికి పాల్పడిన వ్యక్తిని అదుపులోకి తీసుకుని సీజేఐకు బహిరంగ క్షమాపణలు చెప్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దళిత బహుజన సంఘ ప్రతినిధులు గంటాన అప్పారావు, ఎంపి.రాజు, టొంపల సంజీవి, బూర సూర్యనారాయణ, యందవ పోలయ్య, బోడసింగి అప్పలరాజు, యు.రాము, దన్నాన రవి, ఎం.రాజేష్, ఎస్.దాసు, రేగిడి రామకృష్ణ పాల్గొన్నారు.